# అలనాటి డాన్‌జువాన్

రాచకొండ విశ్వనాథశాస్త్రి



కాలం - 1946 సంవత్సరం. స్థలం- చెన్న పట్టణం.

వాడు నా స్నేహితుడు. నాకు దూరపు చుట్టంకూడాను.

కాస్త ఎర్రగా బుర్రగా ఉన్నట్టి డబ్బుగలవాడెవడైనా తనతో దోస్తీగా తిరుగుతే చాలు :

"నువ్వు చూసేవోలేదోకాని, వాడుంటాడొరే, నిజంగా భూలోకరంభుడంటే రంభుడు" అనడం వాడికి అలవాటు.

"భూలోకరంభుడు" అనే పదానికి "డబ్బుతో బాగా పులిసిన ఒక అందమైన కుర్రవాడు" అని అర్థం మావాడి నిఘంటువులో.

పగలు పది గంటలకి ఎండలో చెమటలు కక్కుకొంటూ, ధూళిని పీలుస్తూ, బజారంట నే పోతూఉంటే మైలుదూరం నుంచి "ఒరే, తాతప్పా!" అనే గావు

కేక వినిపించింది. సరిగ్గా ఒక మైలు దూరంలో ఉంటేనేగాని పిలవదు మా వాడు. పిల్చిన వాడు అక్కణ్ణుంచి కదల్డు. వచ్చినట్లు అంతదూరం మనం వెనక్కి వెళ్ళవల్సిందే.

వచ్చినట్లు వెళ్లేను.

గుళ్లో దేవుళ్ళాగ గొడుగు నీడలో భద్రంగా నిల్చున్నాడు. తెల్లటి పంచె. గ్లాస్కో మల్లులాల్చీ, వెనక్కి దువ్వుకున్న జుట్టు, పువ్వులా ఉన్నాడు.

"ఏమిటి సంగతి ? అని చిరాగ్గా అడిగేను.

"సాయంకాలం బీచికి వస్తావా ?" అని వాడు నన్నడిగేడు.

"అంతకంటె వచ్చు ప్రశ్న మరేం దొరకలేదా ?" అన్నాను.

వాడు నా కోపాన్ని లక్ష్యపెట్టకుండా, "ఇవాళ తప్పకుండా రావాలిస్మీ" అన్నాడు.

"ఏం ?"

"నా ఫ్రెండొకడొచ్చేడు. అతను కూడా లా కాలేజీలో జాయినవుతాడు. నిన్ను ఇంట్రడ్యూస్ చేస్తానని అతన్తో చెప్పేను."

"ఉద్ధరించేవు ! కాని, ఎవడువాడు?"

"తెలీదు నీకతన్ని. నే సాయంకాలం చూపిస్తాకదూ. భూలోక రంభడంటే రంభడు"

ఆ మాట చాలు. వాణ్ణి చూడ్డానికి నేను ఇష్టపడకపోవడానికి. మావాడు "రంభడు" అని ఎవణ్నయినా అన్నాడా, బొటనవేలు దగ్గర్నుంచి బోదిగుండు వరకు వాడెలా ఉంటాడో ఊహించుకో వచ్చు. వేరే చూణ్ణక్కర్లేదు.

నే వెళ్ళాస్తా" అన్నాను.

"సాయంకాలం తప్పకుండా రావాలిస్మీ, మన మామూలు ప్లేసే. సిక్సో క్లాక్ షార్ప్. లేకపోతే. అతను పాపం, చాలా డిసెపాయింటవుతాడు"

"అవనీ, డిసెపాయింటవనీ" అనుకుంటూ సాయంకాలం ఆరు గంటలకి థియేటర్ వైపు నడుస్తున్నాను.

ఆయనగారికి నన్ను ఇంట్రడ్యూస్ చేస్తాట్ట. ఐ షల్ ఇంట్రడ్యూస్ యూ టు ఈచ్ అదర్ అనకూడదా యేం ? పైగా వాడు 'పాపం' డిసెపాయింటవకుండా ఉండడానికి నేను వెళ్ళాలిట. కొంపలు మునిగిపోవు వాడెవడో డిసెపాయింటవుతే.

సినిమాకి పోయేముందు కాఫీ నీళ్లు తాగుదామని ఆలయంలో అడుగు పెట్టబోయేసరికి ఎదురుగా ప్రత్యక్షం.

రుమాళ్లతో మూతులు తుడుచుకుంటూ ఇద్దరూ బైటకి వస్తున్నారు.

తప్పించుకొందికి నాకు అవకాశం చిక్కింది కాదు.

మావాడు ఎప్పట్లాగే పువ్వులా ఉన్నాడు. పక్కనున్నవాదే భూలోక రంభడయి తీరాలి.

"ఇదుగో మావాడు! హీ యీజ్ మై

కజిన్, తాతప్పా। వీడుకూడా లా కాలేజీ జాయినవుతాడు. అంటూ నా వైపు చూస్తూ యూ షల్ సీ ఈచ్ అదర్ ఎ గుడ్ లాట్ దేర్" అన్నాడు.

"నీ అబ్బ నాదెరుగుదువా, నీ తాత నాదెరుగుదువా? ఇంతమంచి వస్తువుని నీ జన్మలో ఎప్పుడైనా చూసేవా" అని సహారా ఎడారికి శ్రావణమేఘాన్ని చూపించి మురిసిపోయినట్లుగా వానిని నాకు చూపించి మురిసిపోతూ నిల్చున్నాడు మావాడు.

శ్రావణమేఘం నా చెయ్యి పట్టుకు ఊపేసింది.

మావాడి ప్రకారం నేను "ధన్యుణ్ని, ధన్యుణ్ని" అనుకోవలసి ఉంది.

"ఈయన పేరు?" అని మావాణ్ణి అడిగేను.

"నా పేరు పిచ్చెయ్య" అన్నాడా భూలోకరంభదే ఇంగ్లీషులో.

నోట్లో పిడచపెట్టుకొని మాట్లాడినట్టుగా, కొంచెం బరువుగా, కొంచెం బొంగురుగా వచ్చింది వాడిమాట. అంతా దొర్ల ప్రొనన్సియేషన్ కాబోలు.

"పిచ్చెయ్య", "పుల్లయ్య" ఇలాంటి పేర్లు మార్చుకొనో, లేక త్రుంచుకొనో సాపు చేసుకొంటున్నారు ఈ మధ్య చాలామంది. అటువంటిది వీడు తన పేరు ఆ రీతిగా పూర్తిగా ఎందుకు చెప్పేసుకొంటున్నాడా అని ఆశ్చర్యపోయేను. అందరూ అలా మార్చుకొంటున్నారు కదా, అని వాడు తన పేరు అలానే ఉంచుకొన్నాడనీ, "మీ అందరికంటే కూడా నేను అల్ట్రా మోడర్న్‌గా ఉన్న వాణ్ని. అయినా అయామ్ నాట్ అషేమ్డ్ ఆఫ్ మై నేమ్'' అనే సుపీరియారిటీ కోసం, ఆ రీతిగా పాతకాలపు పేర్ని రీటేన్ చేసేడనీ, రకరకాల గొప్పల్లో అదొక గొప్పనీ తరువాత తెలిసింది నాకు.

పరిచయం అయాక, ఎక్కడో ఏవల్ల కాట్లోనో జరుగుతూన్న క్రికెట్‌మాచ్ స్కోర్ ఎలా ఉందో, ఎవరి ఛాన్సెస్ ఎలా ఉన్నాయో మాట్లాడుకొన్నాం.

తరువాత వాళ్ళిద్దరూ వెళ్ళేరు. వెళ్తూ మావాడితో వాడేదో అన్నాడు. మావాడు "ఒరే, మేం 'కోవాడిస్'కి వెళ్తున్నాం. ఒస్తావేమిట్రా?" అని అడిగాడు.

ఈ పెద్దమనిషి ఆరుగంటలకి పంక్చువల్‌గా నన్ను టీచికి రమ్మన్నది. "నే రాను" అనేశాను ఖచ్చితంగా.

వాళ్ళిద్దరూ వెన్వెంటనే ట్రాన్స్ అట్లాంటిక్ ఏర్‌లైనర్ ఎక్కినట్టుగా, లాగలేక చస్తూన్న వాడి రిక్షా ఎక్కేరు.

ఇద్దరిదీ కలిపి మూడువందల పౌన్లకి తక్కువ వుండదు బరువు. బేరమాడితే మూడణాలిస్తారు. బేరం ఆడకుండా ఉంటే ఓ పావలా పారేస్తారు. ఓ! ఖాదర్! గెటవే! గెటవే! కావలిస్తే ఈ పరకా పట్టుకుపోరా! ఆర్ వుయ్ లేట్! షుడ్ హావ్ టేకెన్ ఎ టాక్సీ!

థిస్ బగర్ ఈజ్ స్టిల్ హియర్ ! ఎందుకు షూట్ చెయ్యరు ఈ రిక్షావాళ్ళు వీళ్ళనందర్నీ !!

అని అనిపిస్తే తప్పా ?

రిక్షా కదిలింది. సందు మళ్ళింది.

"ఉన్నాయిరా బాబూ అన్ని లక్షణాలు నీకూ" అనుకున్నాను హోటల్లోకి వెళ్తూ భూలోక రంభడి గురించి.

వాడు శ్రావణ మాసపు నీటి మేఘంలా నల్లగా లేడు. గీసిన పందిలా ఎర్రగా ఉన్నాడు. ఎత్తుగా, లావుగా, ఎనుబోతులా మాంచి బలంగా ఉన్నాడు. ముఖం అంతా ఎర్రగా ఉండేమో, అందు మీద గీసిన గడ్డం ఆకుపచ్చగా నీడలా కనిపిస్తోంది. కనుబొమలు దళసరి పొడవూనూ, కళ్ళు చిన్నవో పెద్దవో తెలీలేదు, కూలింగ్ గ్లాసెస్ పెట్టుకున్నాడు. ఎత్తుగా ముక్కు, స్పానిష్ కట్ మీసం, దళసరి పెదవులు, ఎగుడు దిగుడుగా వెనక్కి దువ్వుకున్న జుట్టు నలుపూ, పాలిష్ చేసిన బూట్ల నలుపూ ఒక్కలా మెరుస్తున్నాయి. డార్క్ బ్లూ ఉన్ని పంట్లాం, వైట్ వి నెక్ జాకెట్. నోట్లో సిగరెట్, చేతిలో సిగరెట్టిన్. సీరియస్ డిమెనర్.

డాన్ జూఆన్, కాసనోవా, రేమన్నెవారో, రుడాల్ఫ్ వేలెంటినో, గాఘో, డాగో, గిగోలో, రంగసాని మొగుడో !

వాడి వేషం, వాడి ఫక్కీ, అన్నీ నే ఊహించుకొన్నట్టుగానే ఉన్నాయి. నాకు ఒప్పుకోవడం ఇష్టంలేదు కాని వాడు కొంత బాగానే ఉన్నాడు. మావాడు వాణ్ణి ఇంద్రుడు, చంద్రుడు, 'భూలోక రంభడు' అనకుండా ఉన్నట్లయితే "ఫరవాలేదు" అనేసి వాణ్ణి పర్సనాలిటీ పరీక్షలో పాస్ చేసి ఉందును. హోటల్లో కాఫీ తీసుకొని బైటికి వచ్చేను.

మా చుట్టం మరొకాయన ఉన్నాడు. ఆయనకి ఇంగ్లీషువాళ్ళమీద తెగకోపం ఉండడం చేత, సంజీవి, పుష్పక విమానం, వారుణాస్త్రం, కామధేనువు, ఇలాంటివి ఉన్నాయని ఒక పాలసీ పెట్టుకుని నమ్ముతాడు. ఆ దినం నేకూడా అదే విధంగా, వాళ్ల ఇంగ్లీష్ పిక్చర్‌కి వెళ్లేరుకదా అని, ఎంచుకొని ఎంచుకొని ఒక జానపద చిత్రాన్ని చూడ్డానికి ఓ మూరుమూల థియేటర్‌కి పోయేను. తరువాత మళ్ళీ ఈ పిచ్చెయ్య ఉరఫ్ భూలోక రంభడు కాలేజీలో కనిపించేడు. అవి తొలి రోజులు. వాడు కొంచెం లేటుగా చేరినట్టున్నాడు. ఓ రోజు ఏనెన్ట్ లా క్లాసులో 'అటెండెన్స్' తీసుకోడం జరిగింది. ప్రొఫెసరంటే అందరికీ భయం చేత క్లాసంతా హాజరయేరు. ఇంకా లెక్చర్ ప్రారంభం కాలేదు. హాలంతా నిండుగా ఉంది. కాని నిశ్శబ్దంగా ఉంది. నల్లటిజుట్టు, ఎర్రటి ముఖం, పొడవు, వెడల్పు, బ్యూటిఫుల్ డ్రెస్!

"వస్తున్నాడు కథానాయకుడు మాస్టర్

విరల్, కాసుకోండి కాసుకోండి" అన్న ట్టుగా గంభీరంగా వదుస్తూ ప్రవేశించేడు పిచ్చయ్య. భూమి తలక్రిందులైనా వాడి సీరియస్ డిమెనర్ పోదు. కూలింగ్ గ్లాసెస్ కూడా పోవు.

నాకు ఒళ్ళు మండిపోయిందీ అంటే మండిపోదు మరీ!

క్లాసులో ఒక్కడంటే ఒక్కడికైనా ఒక్క వెధవకైనా బుద్ధీ జ్ఞానం అంటూ ఉందా? వాడివైపు ఎందుకలా చూడ్డం? ఇంద్రుడి కొడుకా? మహారాజావారిగారి దత్తపుత్రుడా? అమెరికన్ అంబాసెడరా? రష్యన్ రాయబారా?

ఎవరైనప్పటికీ, వీళ్ళంతా కళ్ళప్ప గించి ఎందుకలా చూడ్డం?

అందులోనూ ఒక తరహా గర్ల్ స్టూడెంట్స్ ఉన్నారే! డాల్స్! డాల్స్! ఫెదర్ హెడెడ్ డాల్స్! రంగైన రంగు పంట్లాం, పంచరంగుల బుష్ కోటూ, రింగురింగుల జుట్టూ, కనిపిస్తే చాలు వాళ్ళకి మతులు పోడానికి.

ఫూల్స్! ఫూల్స్! యూ స్ లె స్ ఫూల్స్!

అని నేననుకుంటే ఏం లాభం?

లేటుగా వచ్చి క్లాస్ని డిస్టర్బ్ చేసి నందుకు ప్రొఫెసరేమైనా అంటాడేమో నని చూసేను.

ఉఁహూఁ! నోటీస్ చెయ్యలేదతను.

ఈ లోపున ఈ వెధవ పైమెట్టు ఎక్కేసి, గ్యాలరీలో చివరి వరసలో కూర్చొని, "ఓహో! వీరేనా సభాసదులు" అన్నట్టుగా చూస్తున్నాడు.

మరింక వాడివైపు చూడ్డానికి తెగ అసహ్యం వేసేసి ముఖం తిప్పేసు కున్నాను.

ఇంటర్వల్లో పలకరించేడు సుమంతి.

"హలో" అన్నాడు

"హలో" అన్నాను.

అప్పుడే చేరేరు వాడి చుట్టూ కొంత మంది భజనగాళ్ళు. గ్రహాల మధ్య సూర్యుళ్ళా వెలిగి పోతున్నా ననుకొం టున్నాడు కాబోలు.

మావాడు (అనగా మా చుట్టం) తనకీ మధ్య తరచుగా కనిపిస్తున్నాట్ట. నే నెందుచేతనో కనిపించలేదట. నేనెక్కడ ఉంటున్నానోనట? తను హాస్టల్లోనే ఉంటున్నాడట. తన రూమ్కి నేను ఆల్వేజ్ వెల్కమ్ట.సో సీయూ లేటర్ట. బై బై ట.

అవీ వాడు నాతో మాట్లాడిన మాటలు. ఈ రంభరిగాడిగురించి రాయకేపోదు నండీ. అలాంటి వాళ్ళ గురించి తల్చు కొంటేనే వళ్ళుమంటిపోతుంది. ఆ విషయం గురించి .... అదేమిటంటే... ఒక్కొక్కసారి, ఒక్కొక్క మనిషిని చూస్తే మీకు అనిపిస్తుంటోలేదో - అది ఇంట్యూషనే అనుకోండి, లేక గాడిదగుడ్డే అనుకోండి - "అయితేరాలి వీని భార్య ఒక భూలోక సుందరి" అనిపిస్తుంది. ఒక పెద్దమనిషిని చూసి

నప్పుడు అదేవిధంగా తోచింది నాకు. అతనూ, పిచ్చెయ్యా కాలేజీ పోర్టికోలో నిల్చొని మాట్లాడుతున్నారు. అతను లా కాలేజ్ స్టూడెంటవుతే నాకు తెలిసే ఉండేది. కాదు, లా స్టూడెంట్ కాదు.

నాదీ పిచ్చెయ్యదీ ఇంచుమించు ఒకే వయసు. అతను మాకంటె ఓరెండు మూడేళ్ళు పెద్దవ్వొచ్చు. మహాఉంటే ఓ పాతికేళ్ళుంటాయి. నెమ్మదిగా,నాజూగ్గా, మంచిగా ఉన్నాడు. మనిషి పొడవూ కాదు, పొట్టికాదు. పల్చగా ఉన్నాడు. మందహాసం చెయ్యడానికి అలవాటుపడ్డ ముఖం. కళ్ళు కొంచెం పెద్దవి. కళ్ళ జోడుంది. చామన్ఛాయ. జుట్టు కొంచెం పల్చన. ముఖం తేటూ, మనిషి నీటూ, బట్ట ఖరీదూ చూస్తే పైసాపరకా ఉన్న వాళ్ళా ఉన్నాడు.

"అందమైన భార్య ఉండితీరాలి ఇత గాడికి" అనుకొంటూ, మామూలుగా పిచ్చెయ్యని పలకరించి ఒక్క-క్షణం అక్కడ నిల్చున్నాను. వాళ్లేం పెద్ద రహస్యాలు మాట్లాడుకొంటున్నారని అనుకోలేదు. కాని ఎందుకోగాని పిచ్చెయ్యగాడు మాత్రం నా రాకకి కొంచెం చిరాగ్గా ముఖం పెట్టినట్టుగా తోచింది నాకు. ఆ పెద్దమనిషికి నన్ను ఇంట్రడ్యూస్ చేస్తాడేమోనని చూసేను. పిచ్చెయ్యగాడికి అటువంటి ఉద్దేశం ఎంతమాత్రం ఉన్నట్టులేదు.

"ఇంట్రడక్షన్ ఉంటేనేగాని మాట్లా శేని అవస్థవచ్చింది, కర్మ ! పోనీ పోదాం"అనుకొంటూ ఉంటే ఆ పెద్ద మనిషే "ఈ యనెవరో తెలుసుకో వచ్చా"అని అడిగాడు.

మాటలో ఆడవాళ్ళ నాజూకు ఉంది. కాని ఆడారి మాటలా లేదు.

''పరిచయం చెయ్యడం మర్చి పోయేను...'' అంటూ మొదలుపెట్టేడు పిచ్చెయ్య. ఇష్టంలేదని ఎలాచెప్తాడుమరి. ''...ఐయాం సారీ, దిస్ యీజ్ మిస్టర్ తాతప్పా, నా క్లాస్‌మేట్, ఈయన నా స్నేహితులు, డాక్టర్ కోమల్రావ్ హౌవుస్సర్జన్ ఇన్ది హాస్పిటల్'' ఇంట్ర డక్షన్ అయాక నేను క్రికెట్ టెస్టు గురించి మాత్రం మాట్లాడదల్చుకోలేదు. ''గోదావరి వరదల్లో మెడికల్ రిలీఫ్‌కి మీరు వెళ్ళేరా ?" అని అడిగేను.

"వెళ్ళేనండీ" అన్నాడతను చాలా మోడెస్టుగా. కొంతసేపు ఆ విషయం ఈ విషయం మాట్లాడుకున్నాక విడి పోయేం. పాపం ! చాలా మంచివాళ్ళా ఉన్నాడు.

తరువాత అతని మాట మర్చిపోయా న్నేను. రోజుకి వందన్నరమందిని కలు స్తుంటే అందులో చాలామంది గురించి మర్చిపోక తప్పదు. రోజులు రెగ్యు లర్‌గా వెళ్తున్నాయి. ఒక నెల అయిందో ఏమో ఓ రోజు సాయం కాలం ఓ వీధికి వెళ్ళవల్సి వచ్చింది. పని చూసుకొని వచ్చేస్తూంటే

ఓ ఇంటి గుమ్మం ముందు మెట్ల మీద నిల్చున్నాడు అతను. దూరంనుంచే నన్ను చూసి పలకరింపుగా చెయ్యి ఊపేడు. నే కూడా అలానే జవాబిచ్చేసి, ఎవరా అని ఆలోచిస్తూ ముందుకివచ్చి అప్పుడు గుర్తుపట్టగలిగేను అతన్ని. ఏదో మాట్లాడుదాం అనుకునేసరికి, ఇంతలో వెనక గుమ్మంలోంచి వచ్చిందండీ ఆవిడా, లేతాకుపచ్చ చీర, తెల్ల జాకెట్టు, ఇరవయ్యేళ్ళ మనిషి.

"ఉండితీరాలి ఇతనికి అందమైన భార్య" అని నే ననుకోడం గొప్ప పొరపాటు. ముఖం తిరిగింది ఆవిణ్ని చూసే సరికి నాకు.

అందంగా ఉండడం ఏఁవిఁటీ ??

లక్షదీపాల కాంతిలా వుంది. ఉదయించిన అరుణరేఖ లన్నింటినీ తన్లో ఐక్యం చేసేసుకున్నట్టుగా ఉంది సముద్రపు కెరటాల మీది చంద్ర కిరణాలన్నింటినీ తీసేసుకొని దాచేసుకున్నట్టుగా ఉంది. బంగారు బొమ్మా?భూలోక రంభా? భువనమోహినా? నేను గుమ్మెత్తిపోయి దంగువాయించి పోయేను.

నోటంట మాట వచ్చిందికాదు. "ఒస్తానొస్తాను. మళ్ళీ కలుసుకుందాం" అని ఏదోవిధంగా తడబడుతూ అనేసి నడవలేక నడుస్తూ వెళిపొచ్చేసేను. మరోక్షణం అక్కడున్నానా, నిలువునా కూలబడిపోయేనన్నమాటే.

మర్నాడు కాలేజీలో కలుసుకున్నాను పిచ్చెయ్యని.

ఈ మధ్య కాలంలో నాకూ పిచ్చెయ్యకీ ప్రస్తుతం మోడర్న్ యంగ్ మెన్ మధ్య వుండేలాంటి స్నేహం కలిసింది. అంటే, వాడికి నన్ను చూస్తే ఇష్టం లేదు. నాకు వాణ్ని చూస్తే ఇష్టం లేదు. క్యాథాయ్ అంటే క్యాథాయ్. హలో అంటే హలో. ఇస్కో అంటే ఇస్కో. వాడివైపూ, ఆపిక్చర్ వెరీ గుడ్, వెరీ గుడ్. ఈ పిక్చరూ, వాడి సిస్టరూ రాటెన్ రాటెన్. అన్నీ స్కాండెల్స్ స్కాండెల్స్ ::

అటువంటి స్కేండలస్ స్నేహం మాది.

పిచ్చెయ్యగాడి బాబు మలయాలో దొరల్దగ్గిర ఏదో గులాంగిరీ చేస్తున్నాట్ట. చిత్తుగా డబ్బు దొరుకుతూన్నట్టుగా వుంది. ఇదివరకు ఇక్కడెక్కడో దివాన్‌గిరీ చలాయించేట్ట. అప్పుడు మస్తుగా డబ్బు దొరికే వుంటుంది. అందుచేత ఈ పిచ్చెయ్యగాడి వ్యవహారం ఇక్కడ ఇస్పేటాసులా వుంది. సినీమాలు, నాటకాలు, భరత నాట్యాలు, వెనక బోలెడుమంది భజనగాళ్ళు. వాడి మధ్య ఒంటిగా కనిపించడమే అరుదై పోయింది.

కాని ఆరోజు మధ్యాహ్నం ఇంటర్వెల్లో కాఫీ త్రాగి వేగిరం వచ్చేసేను కాలేజీకి. వచ్చి చూద్దునూ :

పిచ్చెయ్యగాడు ఓమూల కూర్చొని తల వంచుకొని ఏదో తెగరాసేస్తున్నాడు గబగబా, గబగబా.

ముందే పలకరిస్తే రాస్తున్నదేదో దాచేస్తాడని, హాలుకి వెనక ద్వారం లోంచి గ్యాలరీ ఎక్కి వాడి వెనక్కి నెమ్మదిగా వచ్చి చూసి షాక్ అయి పోయేనంటే నమ్మండి.

ఎవరివో చూసి టార్చ్ నోట్స్ రాసేనుకొంటున్నాడు.ఇన్నాళ్లూ ఏమిటో అనుకున్నాను. వెధవది ఒట్టి దొంగ వెధవ చదువు. పైకి అందరితోనూ గలాటా చేస్తూ తిరగటం. ఇలా రహస్యంగా ఒంటిగా చదవడం

హమ్మ! దొంగగాడిద కొడకా అను కున్నాను.

అకస్మాత్తుగా వెనకనుంచి ప్రత్యక్షమైన నన్ను చూసి వాడు కూడా ఆ రకం గానే అనుకొని ఉంటాడు.

ఒక్కక్షణం కొర కొర లాడుతూ చూసి, "పైన్నెలా వచ్చేవేం" అన్నాడు.

"దొంగ వెధవలా వచ్చేవే" అన్లేక.

"వెతికి వెతికి వాడినట్టున్నావే మాటా" అన్నానేను, పక్కనే కూర్చొంటూ, నే కూడా ఓ విషపు నవ్వు నవ్వుతూ.

"క్షమించి అలానే కూర్చో. ఫైవ్ మినిట్స్‌లో ఇది పూర్తి చేసేస్తాను" అని రాసుకోడం తిరిగి మొదలెట్టేడు వాడు. ఆవిడ గురించి సంభాషణ ఎలా ప్రారంభించడమా అని ఆలోచిస్తూ కూర్చొన్న నాకు పిచ్చెయ్యగాడి ముఖంలో ఏదో కొత్తదనం తోచింది. ఏం ఏంట్రా అవి పరికిస్తే తెలిసొచ్చింది కూలింగ్ గ్లాసెస్ తీసేశాడు. నాకు సంతోషంతో కూడుకున్న విషపు నవ్వొచ్చింది.

"ఎన్నాళ్ళు దాగుతుందిరా, అబ్బీ, నీ కూలింగ్ గ్లాసెస్ కిటుకూ" అను కున్నాను. వాడికి చిన్న 'చిరుమెల్ల' ఉంది.

భగవంతు డిచ్చిన దానికి మనమేం చెయ్యలేంవనుకోండి. మెల్లకన్నుండడం వాడి తప్పని నేనన్ను. ఎందుకంత నామోషీ అంటాను. ఈలోపున వాడికేం అనుమానం కలిగిందో, నావైపు తిరిగేడు. వో చూపు చూసేడు. చాలా కాజ్‌వల్‌గా కళ్ళజోడు పెట్టేసుకున్నాడు. అంతవరకూ ఆవిడ గురించి సంభాషణ ఎలా ప్రారంభించడమా అని ఆలోచించిన నేను డైరెక్ట్ మెథడ్ ప్రయోగించేను. "కోమ్మ్రలావ్ వైఫ్‌ని చూసేవోయ్" అన్నాను.

"ఆ!" అనబోయి "ఆహా!" అన్నాడు వాడు.

"భూలోక రంభలా వుంది"అవబోయి మావాడి మాట జ్ఞప్తికివచ్చి "చెప్పలేనంత బ్యూటిఫుల్‌గా వుందోయ్" అన్నాను.

అంతటితో వాడు రాయడం ఆపు

చేసేడు.

"ఎప్పుడు చూసేవ్? వాళ్ళింటి క్కాని వెళ్ళేవా?" అనుమానం అడిగాడు.

"వీధిలో వెళ్తూ చూసేను"

వాడేం మాట్లాడలేదు.

"నువ్వెప్పుడూ చూళ్ళేదా?" అని అడిగేను.

"చూసేను" జవాబు అయిష్టంగానూ ఆలస్యంగానూ యిచ్చేడు.

"వాళ్ళింటికి వెళ్ళి చూసేవా?"

వాడికి నా ప్రశ్నలు ఏవీ ఇష్టంగా లేవు.

"ఏదో అలానే" అన్నాడు.

"వాళ్ళింటికి తరచు వెళ్తుంటావా?"

"అప్పుడప్పుడు"

"వాళ్ళని చాలా బాగా తెలుసునన్న మాట".

"ఏదో"

"ఏ వూరో ఆవిడది?"

వెధవ్వి నీ కెందుకీ భోగట్టాలన్నీ, అని వాడు మనసులో అనుకున్నాడని నేను ఘోర ప్రతిజ్ఞ చేసి చెప్పగల్ను. పైకి మాత్రం,

"ఏమో నాకు తెలీదు బ్రదర్. ఆవిడ నాకెంత మాత్రం బ్యూటీఫుల్‌గా కనిపించలేదు. అండ్ ఐ వాక్ నాట్ ఏన్క్షస్ టు నో నచ్ డీటేల్స్!" అని ఆవలిస్తూ ఏదో బద్దకంగా అన్నట్టుగా అన్నాడు.

అంతా ఎందుకు చెప్తున్నానంటే, వాడున్నాడే, అ పిచ్చెయ్యగాడు, వాడికి మొదట్నించీకూడా ఇష్టం లేదండీ, వాళ్ళ గురించి ఏ విధమైన ప్రసంగం కూడా నాదగ్గర తేడానికి.

అయితే -

పరుని భార్య గురించి నీకంతగా తెలిసికోవాల్సిన అవసరం ఏమొచ్చిందయ్యా? నీకేం దురుద్దేశం ఉందో! అని ఎవరైనా అనొచ్చు. ప్రతి వాడూ అంటాడు.

అందమైన దేవీ విగ్రహం ఉన్నదనుకోండి. ఎవరు తయారుచేసేరు? ఏ వూరిది? ఏ కాలంది? ఇటువంటి ప్రశ్నలు సహజంగా వేస్తాం.

ఆవిడ గురించి నేకూడా అంతే.

అలా అనిచెప్పి ఆవిడ్ని మరోసారి చూడాలని అనిపించక పోలేదుస్మండి. వాళ్ళింటికి నన్ను తీసుకువెళ్ళమని పిచ్చెయ్యగాడికి హిన్ట్ ఇచ్చేను నాలుగైదుసార్లు. వాడు నాహిన్ట్ తీసుకోనే లేదు. అంతేకాదు, కోమల్రావూ తనూ తిరుగుతున్నప్పుడు నే తారసిల్లితే చూడనట్టు నటించి అతణ్ని మరోవైపుకి తీసుకుపోయేవాడు. ఇంక ఆవిణ్ని చూడాలంటే ఏదో పనిపెట్టుకొని అటువైపువెళ్ళి తచ్చాడ్డమో, ఏదో మిషపెట్టుకొని వాళ్ళింటికి వెళ్ళడమో చెయ్యాలి. "కోమల్రావు నీ పెళ్ళాన్ని కొరుక్కు తినేస్తాననుకుంటున్నాడు కాబోలు, వెధవ" అని పిచ్చెయ్యగాడిమీద నే

కోపంగా ఉండడంచేతా, ఎంత రంభైనా పైవాడి పెళ్ళాంకదా అనే ఉద్దేశంచేతా, సిల్లీగా అబద్దాలాడి వాళ్ళింటికి వెళ్ళాలని లేకపోవడంచేతా. ఇంతలో మళ్ళీ ఆవిడే కనిపించింది.

మొదటిసారి ఆవిడ్ని చూసినప్పుడు ముఖం తిరిగిందని చెప్పేనా ?

ఆవిడ్ని రెండోసారి చూసినప్పుడు మూర్ఛ వచ్చేటంత పర్యంతం అయింది.

మధ్యాహ్నం మూడు గంటలాట సినిమా, బాల్కనీలో వెనక వరస కుర్చీలో కూర్చున్నాను. నా వెనక 'బాక్స్' అందులోంచి అదేపనిగా వినిపిస్తున్నాయి ఇంగ్లీషులో మాటలు, కిచకిచ నవ్వులు. ఆడా మగా గొంతుకలు. ఎవరా అనే క్యూరియాసిటీ కలిగింది. ఇంటర్వల్లో తెర వేసుకోవచ్చు వాళ్లు. అందుచేత బైటకి వెళ్లాల్సిన పని ఉన్నట్టుగా లేచి వెనక్కి చూసేను. తెరమీంచి రిఫ్లెక్టు అయిన వెలుతురు వాళ్ల ముఖాల మీద పడుతోంది.

అవకాశం ఉండీ, ఆడదాన్నయితే మూర్ఛపోడానికి అంతకంటె మంచి సమయం దొరకదు. హాలు హాలంతా గగ్గోలెత్తిపోను. కాని నిశ్చేష్టుణ్నయి పోయేను. కష్టంమీద మూర్ఛని ఆపుకున్నాను. ఆవిడ ! ఆవిడ పక్కనే, ఆవిడకి అతి దగ్గరగా భూలోకరంభడు. ఎంత ఘోరం !!

ఎంతసేపు స్టేర్ చేసేనో తెలీదు పిచ్చెయ్యగాడు పోల్చిపట్టేడు నన్ను. వాడు బాకులు నూరుతూ చూసేడు. నేను కత్తులు నూరుతూ చూసేను. తరవాత సీట్లో కూర్చున్నానే కాని తెరమీద బొమ్మ కనిపిస్తేనా ? వెనకనే కూర్చొన్న వాళ్ళ గురించి తల్చుకొంటూంటే ఒళ్ళు సలసల కాగిపోయింది. వాళ్ళిద్దరూ ఏదో గుసగుసలాడుకున్నారు. కాని నాకు సరిగా వినిపించలేదు. ఆనాడు నాకళ్లు నిప్పులు కక్కడం హాల్లో అంతా చూసే ఉంటారు. నావళ్ళు మండిపోవడం కూడా చూసే వుంటారు.

దాన్నీ వాణ్నీ కూడా పొడిచెయ్యాలనిపించింది.

నాది ఒట్టి జెలసీ అని మీరంటారా ?

నేను మాత్రం నాది ఒట్టి కోపం అంటాను. రైటియస్ ఏన్‌గర్. వాడి వ్యవహారం ఎంత స్కేండలస్‌గా వుందో మీరే యోచించండి. పైవాడి పెళ్ళాంతో, అందులోనూ నమ్మిన స్నేహితుడి భార్యతో సయ్యాటలు సాగిస్తున్న వెధవని ఏంచేస్తే పాపం ఉందో చెప్పండి. తొక్కలో ల్చేయొద్దా ? గుడ్లు పీకేయొద్దా ? నోరుపెగల్దీసి కాగిన సీసం పొయ్యొద్దా ? ఇవాళ ఆ పెద్దమనిషి పెళ్ళాం అయింది. రేపొద్దున్న నీ పెళ్ళాం అవొచ్చు. ఎల్లుండి నాకు పెళ్ళవుతే నా పెళ్ళామే అవొచ్చు. ఎంత ట్రెచరీ, ఎంత డిప్రేవిటీ! నేను

ఊరుకోదల్చుకోలేదు.

మర్నాడు కాలేజీలో పిచ్చెయ్యగాణ్ణి రెక్కపట్టుకొని ఓ మూలకి ఈడ్చుకు పోయి గుండు వాచిపోయేట్టు చీవాట్లు పెట్టేను. నువ్వు మనిషివా, దున్నపోతువా? నీకు ఉచ్చం నీచం అంటూ ఉందా లేదా? నీ కతను స్నేహితుడనైనా ఆలోచించావా? పాపం అతను ఆస్పత్రిలో గొడ్డుచాకిరీ చేస్తుంటే నువ్విక్కడ అతని పైపుతో షికార్లు కొడతావా? ఆమాత్రం పనిచెయ్యలేకే అందరూ ఊరుకొంటున్నా రనుకుంటున్నావా? నమ్మినవాణ్ణి దగాచెయ్యడం ఎంత పాపమో నీకు తెలుసా?

నేనంత సీరియస్‌గా చెప్తూంటే వాడేం చేసేడో తెలుసా?

నవ్వేడండీ ఆ వెధవ!

'అమ్మా'అని పిలుపు లేకుండా చచ్చేట్టు డొక్కలో పొడిచెయ్యాలనిపించింది. నా నోటికి బ్రేకు పడ్డంచూసి, స్విచ్‌నొక్కి లైట్ ఆర్పేసినట్టు టక్కుమని నవ్వు నాపేసి, ధన్‌మని ఒక్కసారి ఉగ్రుడై పోయాడు, దొంగవెధవ.

"నీ పనేదో నువ్ చూసుకో నా పనేదో నే చూసుకుంటాను. ఈ భోగట్టా మళ్లీ ఎత్తేవంటే ఖబడ్దార్"అని ఉరిమిచూసి ఫర్ ఫర్‌మని నడుచుకు పోయాడు.

అవిటవాడు చూసుకునే పన్లు.

ఒక్క క్షణం ఆలస్యం అయిపోయింది కాని జుట్టుపట్టుకొని గుంజాయించేద్దును. తరవాత, మరి "ఆహా! నీ పని ఇలా వుందిట్రా" అని అనుకున్నానే గాని ఏం చెయ్యాలో తోచలేదు. వాణ్ణి ఏదో ఒకటి చేసెయ్యాలి. కాని నాకు తలా తోకా అందిందికాదు. కాలూ చెయ్యీ ఆళ్ళేదు.

ఈలోపున దాన్నీ వీడిదీ వ్యాపారం ఖ్రశిమించి రాగాన్నపడింది.

మరో వారంరోజులకి వాళ్ళిద్దర్నీ బీచిని చూసేను. మరో రోజున ఆటో రిక్షాలో ఝామ్మని ఎక్కడికో చపాయించేస్తున్నారు. ఓనాడు కులుకుతూ కాఫీ హోటల్లోకి వచ్చి, ఫ్యామిలీస్ ఓన్లీలోకి దూరేరు. ఇద్దరూ మొగుడూ పెళ్ళాల్ని మించిపోయినట్టుగా ఉన్నారు. ఇంత మహాపట్నంలో ఎవ దెవడో ఎవడికి తెలుసు. పైవాళ్లు చూస్తే వాళ్ళని మొగుడూ పెళ్ళాలే అనుకుంటారు. అందుకేకాబోలు అంత సాహసం. కాని, ఏం సాహసం, ఏం సాహసం!

పిచ్చెయ్యగాడు పక్కా బద్మాష్. కాబట్టి దేనికైనా సాహసించేస్తాడు, కాని, ఆడమనిషి కదా, దానికైనా బుద్ధుండొద్దూ? దాని వేషం, దాని ఇంగ్లీషూ చూస్తే ఎడ్యుకేటెడ్ వుమన్‌లా వుంది. ఇటువంటి పంజారీ పన్లు చెయ్యడానికేనా ఏఁవిఁటి ఆ చదువుకోడం అంతాను. ఇంక ప్రతీ ఆడదీ యిలా బరితెగించి

బజారంట పరుక్కొ లంకించుకుందంటే సంసారాలు సాగినట్టే! ఎవరైనా పూను కొని దానికి వాడికికూడా చెప్పుచ్చుకొని పళ్లు రాలగొట్టి నోట్లో పేడ పెట్టకపోతే లాభం లేదనుకున్నాను.

అయినా –

ఎవరైనా పూనుకోవాల్సిన కర్మ ఏమొచ్చింది ? ఆ మొగుడు ముండా కొడుకు ఏం చేస్తున్నట్లు ? అతడ్నే మనుకొని ఏం లాభం ? ఏదో ఆస్ప త్రికి పోతాడు. ఒస్తాడు. తను లేన ప్పుడు అడది ఇంట్లో బుద్ధిగా వుంటుం దనే అనుకుంటాడు. కాని, పకీరు వెధ వల్తో షికార్లు కొడుతుందని ఎలా అనుకోగల్డు ?

పూర్ ఇన్నోసెంట్ ఫెలో!

అతనికేం తెలిసుండదు. ఎలా తెలుస్తుంది ?

ఆలోచించగా ఆలోచించగా అతని కొక వార్నింగు ఇవ్వడం నా విధాయకం అని తోచింది. అదీకాక – పోనీ మన సామ్మేం పోయిందని ఊరుకొంటే ఏమౌతుందో యోచించండి. ఏమవు తుంది? రేపట్నించి ప్రతి సందుమొగ లోనూ, ప్రతి ఇంటి గుమ్మం ముందూ భూలోకరంభట్లు బీటుకాయడానికి తయారు. నాకు ఒక కవీశ్వరుణ్ని బాగా తెలుసు. తన పెళ్ళాన్ని విడిచిపెట్టేసి, పైవాళ్ళ పెళ్ళాలందర్నీ "ప్రేయసీ ప్రేయసీ" అని సంబోధిస్తూ పద్యా ల్రాయడం వాడికి బాగా అలవాటు. ఈ భూలోక రంభడుగాడు "ప్రేయసీ, ప్రేయసీ" అని పిలవడు. "హనీ హనీ" అని పిలుస్తాడు ఆ వెధవ ఆ కోమ ట్లావు పెళ్ళాన్ని "హనీ హనీ" అని సంబోధిస్తాడని నేనూహించుకోడంతో, కోమట్లావుకి వార్నింగు ఇవ్వాలనే నా అభిప్రాయం, 'ఇచ్చితీరాలి' అనే నిర్ణ యంగా మారిపోయింది.

యస్ హనీ, నో హనీ, ఈజిట్ సోహనీ, కమ్‌కమ్ హనీ, నో జస్ట్ కిస్ మి వన్స్ హనీ, వన్స్‌మోర్ హనీ.

ఈ రంభడిగాడి ఆట కట్టడితేనేగాని నాకు నిద్రపట్టదు

అనుకున్నాను ఆస్పత్రి దగ్గర ఓ రోజు ఉదయం కోమట్లావు కోసం రోడ్డుకాసి.

స్టెథోస్కోపు పట్టుకొని హడావిడిగా వచ్చేస్తున్నాడు కోమట్లావు. ఎదురుగా వెళ్ళి పలకరించేను.

"ఇదిగో ఇదిగో" అన్నాడతను.

మొట్టమొదట నేను గ్రహించుకో లేక పోయేనుస్మండీ. కాని సంభాషణ సాఫీగా సాక్కపోడం చూసి ఏం.ఏం.ట్రా అనుకున్నాను. అతనికి నా పలకరింపు అంత ఇష్టంగా ఉన్నట్టు లేదు.

గుడ్ మూడ్‌లో లేడు. ఆస్పత్రిలో తన చేతిలో పడ్డ పేషెంటెవరైనా టపా కట్టేసేరేమో అనుకున్నాను. అలాంటి సమయంలో అతని మనసు ఇంకా బాధ

పెట్టరమా అని తటపటాయించేను. కాని మరింక ఇప్పుడు వెనక తీస్తే పరిస్థితులు విషమించవచ్చు. తరవాత "పీక తెగి పోయేదాక ఎందుకూరుకున్నావయ్యా" అని తిట్టిపోస్తే నేనేం చేసేది.

ఆ మాటా ఈ మాటా కష్టం మీద నడుస్తోంది. "మరింక నే నొస్తాను" అనేయడానికి అతను సిద్ధంగా వున్నాడన్నమాట.

"బై ది బై పిచ్చెయ్య కనిపిస్తున్నాడా ?" అని అడిగేను.

ఆ ప్రసంగం నే తెస్తానని ఎదురు చూస్తున్నవాళ్ళా ఉన్నాడు.

"మీ కాలేజీకి టెన్నిస్‌కి రిప్రజెంట్ చేస్తాట కదూ. బిజీగా ఉన్నట్టున్నాడు" అన్నాడు కోమల్రావు.

"నీ పెళ్ళాంతో ఇంకా బిజీగా ఉన్నాడయ్యా" అనేద్దా మనుకున్నాను. పైకి మాత్రం "ఉండడా, బిజీ బిజీగా ఉంటూ అన్నిపన్లూ చెయ్యగల్గువాడు" అన్నాను.

"సరేసరే నే నొస్తాను" అనేటోయేదన్నమాట కోమల్రావు. నేనుపిచ్చెయ్యగాడి గురించి ఈ విధంగా చెప్తానని తెలిసినవాళ్ళా వున్నాడు. అట్టేసేపు నంగికొడితే అతను నా మాట వినకుండా నన్నొదుల్చుకుంటాడని అసలు సంగతిలోకి వెంటనే వచ్చేసేను.

"బిజీగానే ఉంటాడండీ వాడూ. ఇవాళ టెన్నిస్ ఆడతాడు. రేపు క్రికెట్ ఆడతాడు. కాని, ఎన్నాట లాడుతేనేం, ఎన్ని చదువులు చదివితేనేం. కేరక్టరుం డొద్దుటండీ. అదేలేదు వాడికి" అని తెగించి అనీసేను. అని నే నన్నప్పుడు అతను కొంచెమైనా ఆశ్చర్యపోడమో. ఏఁవ లా అంటున్నారని అడగడమో. ఏదో ఒకటి చెయ్యొద్దూ ? అబ్బే! అదేం లేదు.

"దానికేఁవిటండీ. ఎవరి కేరక్టరు వారిది" అనేసి తుర్రుమని ఆస్పత్రిలోకి దూరిపోయేడు.

"నువ్విలా అందరిగురించీ లేనిపోని స్కాండల్సన్నీ చెప్తావని నాకు తెలుసున్లే వోయ్" అన్నట్టుగా ఉన్నాడు మొదట్నించి చివరివరకూ అతగాడు. అప్పుడు అనుకున్నాను. "ఆఁ పిచ్చెయ్యగాడు గెస్ కొట్టేవుంటాడు నే నిలా చెప్తానని. అందుచేత ముందే ఉపదేశించి ఉంటాడు నేనో స్కాండల్ మాంగర్నని. తెలిసిపోయింది. అంతా అర్థం అయింది నాకు.

కానీ, నా డ్యూటీ నేను చేసేసేను. ఇతగాడు నా మాట వంటపట్టించుకొని మెలకువగా వున్నాడా సరేసరి. లేదా తనే చెడతాడు. అదీలోపున ఏ మంచి ముహూర్తవోఁ చూచుకుని నగానట్రా పట్టుకుని ఏ జట్కావో రిక్షావో ఎక్కేసి ఆ రంభదిగాడితో ఉడాయించేస్తుంది. అప్పుడు నన్నెవరేమనీ ప్రయోజనంలేదు.

పోనీ, వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్లాల తంటె దోస్తీగా చెయ్యీ చెయ్యీ కలుపుకొని తిరగడం చూసేవు కాబట్టి, బందగా కొట్టొచ్చినట్టు "నీ పెళ్ళాం వాడితో రంకుపోతోం దయ్యా అనే లేక పోయావా ? అని ఎవరైనా అడగొచ్చు. ఇలాటి విషయాల్లో అలా ఎవరూ చెప్ప లేరుస్మండీ. ఆడదాన్ని బట్టవిప్పి నడి రోడ్డుమీద నిల్చోబెట్టినట్టుగా నిజాన్ని విడమర్చి చెప్తాననుకోండి. నా మాట నమ్మేదా ఒక బాధ. నమ్మకపోయేదా, "నా పెళ్ళాంమీద అంత ఘోరంగా నిందలేస్తావుట్రా స్కౌండ్రల్" అని బూతులు తిట్టి, జట్టీకి దిగి కుస్తీ పట్టొచ్చు అందుచేత ఏదో నాకు తోచి నట్టుగా వార్నింగు ఇవ్వగలిగేను. మర్నాడు పొద్దున్న ఆరోగంటకల్లా రంయ్‌రంయ్‌మని కొట్టుకొచ్చి సేడు పిచ్చెయ్యగాడు, ఓ ఎరుపు మోటార్ సైకిల్‌మీద. ఆ ముందు రోజు రాత్రి మోటార్‌కారొకటి మా ఇంటి ముందు ఆగింది. ఎవరో మహానుభావులు వచ్చే రనుకున్నాను. తీరాచూస్తే వాళ్ళచేతుల్లో చందా డిబ్బీలున్నాయి. "కుండలో బియ్యం నిండుకున్నాయిరా అబ్బీ" అన్నట్టుగా జేబులో డబ్బులు నిండు కున్నాయయ్యా" అనడానికి వీల్లేక పోయింది. తంతే దమ్మిడీలేదనిమాత్రం ఎలాగో ఓలాగ తెలియజేయగలిగేను. అయినా వాళ్లు ఒదల్లేదు. ఆఖరికి ఓ అయిదురూపాయలు అరువు చందా వేస్తేనేగాని కదిలేరుకారు. ఆ సొమ్మెప్పుడో ఒకప్పుడు వాళ్ళ ఎదాన్న పొయ్యాలి. వాళ్ళంత రాత్రప్పుడు మోటారుకార్‌మీద ముష్టికొచ్చేరు. ఇహవీడు ఇంత పొద్దున్నే మోటారు సైకిల్ మీద అప్పుకొచ్చేదేమోనని భయపడ్డాను.

వాడి డ్రెస్ చూస్తే కొంత ధీమా కలిగింది.


తెల్లజోడు. తెల్లమేజోడు. తెల్ల నిక్కరు. తెల్లతాళ్ళ బనియను. తెల్ల గాన్నో. కాలేజీని టెన్నిస్‌లో రిప్రె జెంట్ చేస్తున్నాడు కదూ. ప్రాక్టీస్‌కి పోతున్నట్టుగా వున్నాడు. ఆటాడ్డానికి, ఆడాళ్ల పేరంటానికి ముస్తాబైనట్టు ముస్తాబయ్యేడు.

సైకిల్‌మీంచి దిగి, దానికి స్టాండ్ వేసి వాడు దగ్గరగా రాగానే ముఖం బాగా చూసేను. కొరకొరలాడుతున్నాడు దెబ్బలాటకి తయారయివచ్చినట్టున్నాడు.

ఏదో తంటా ఉందిరా, అనుకున్నానే గాని చెక్కుచెదర్లేదు.

"ఏమిటి చెప్పేవుట కోమల్రావుతో" అని జోరుగా అడిగేడు వస్తూనే. ఓరి కోమల్రావూ అనుకున్నాను. వీడతనికి అంత బాగా విషం ఎక్కించేడనుకో లేదు.

''నీ కేరక్టరు మంచిది కాదని చెప్పేను'' నేనాభయపడేవాడ్ని. మా




విధిలో నిల్చున్నాడన్న సంగతి మర్చి పోతున్నాడు కాబోలు రంభడుగాడు.

"ఎందుకు చెప్పేవలా ?"

"ఎందుకు చెప్పేనో నీకుతెలుసు, నాకు తెలుసు"

"మా విషయంలో జోక్యం కలిగించుకోవద్దని చెప్పేనా ? లేదా ?"

"నువ్వు చెప్తే నేను వినేవాణ్ణనుకున్నావా ఏఁవిటి ?"

"వినకపోతే...."

"వినకపోతే ?"

"జాగ్రత్తని చెప్పేనో సారి నీతో జ్ఞాపకం ఉందా ?"

"ఇది మా వీధని నీకు జ్ఞాపకం వుందా ?"

అంతటితో ఏమాలోచించుకున్నాడో గాని, వెంటనే ప్లేటు మార్చి సేడండి వాడూ. చిన్న చిరునవ్వు నవ్వేడు.

"ఎందుకురా బ్రదర్ నీకంతకోపం" అన్నాడు.

"ఎందుకో, పాపం, నీకు తెలీదు కాబోలు"

"నీకంత జెలసీ ఉందనుకోలేదుస్మీ" అన్నాడు వరండాలో ఓ కుర్చీ తనే దగ్గరకు లాక్కొని కూర్చొని.

"జలసీనే అనుకో కాని కళ్ళముందు పాపం చేస్తూంటే నేను చూస్తూ ఊరుకొనేవాడ్నికాను.

వాడు పకపకా నవ్వాడు.

"ఎందుకా నవ్వు ?"

ఇదేం "ఆశ్చర్యకరమైన ముగింపు" కోసం రాస్తూన్న కధకాదు సుమండీ, వాడు నిజంగా చెప్పేడు అసలు సంగతి. ఆవిడ తనని లవ్ చేస్తోందిట. ఆవిణ్ని తను తప్పక పెళ్ళాడుతాట్ట. ఆవిడ కోమ్రలావు భార్యకాదట. చెల్లెలట.

నేను మరొకసారి గుమ్మెత్తిపోయి దంగు వాయించిపోయేను.

కాని, నమ్మలేకపోయాను.

కావలిస్తే రా నాతో. ఆవిడకి ఇంట్రడ్యూస్ చేస్తాను. నీ చెవుల్తో నువ్వే విందువుగాని ఆవిడ నోటంట". నమ్మకపోడానికి వీల్లేకపోయింది. కాని మళ్ళీ గట్టి అనుమానం ఒకటి కలిగింది.

"అయితే, ఇదివరకే ఈ సంగతి నాతో ఎందుకు చెప్పలేదు ?"

వాడు నవ్వుతూ, "అబ్బాయ్, యీ సంగతి ఇదివరకే తెలిస్తే నువ్వేం చేద్దువో చెప్పు. అప్పటికప్పుడే వాళ్ళింటికి తీసుకువెళ్ళమని నాలుగైదుసార్లు అడిగేవు. అడిగేవా ? లేదా ? ఆ పిల్లని చూడగానే నీక్కూడా కళ్ళు జిగ్గుమన్నాయనీ, నువ్వుకూడా మరింత ఆమెవెంట పడకపోవనీ అనుకుంటే నాదా తప్పు ? ఐయామ్ లవింగ్ హర్. ఐ డిడ్‌నాట్ వాన్ట్ అండ్ ఐ డు నాట్ వాన్ట్ ఎనీ రైవల్స్. పోటీదార్ల నందర్నీ పైకి పమ్పించేయడం నా లక్ష్యం. తరవాత నువ్వారోజున మమ్మల్ని సినిమాలో చూసి చివాట్లుపెట్టేవే. అప్పటిదాకానువ్వు నా గర్ల్‌ని చూసి కోమట్రలావు పెళ్ళాం అనే భ్రమలో ఉన్నావని నాకు తెలీదు" అని చెప్పేడు సిగరెట్టు కాలుస్తూ.

"పెళ్ళాం కాదు. చెల్లెలని ఆ వెంటనే నాతో ఎందుకు చెప్పలేదూ అనే నేనడుగుతున్నది"

"చెప్తున్నాను గదరా బ్రదర్! నువ్వు అలాంటి భ్రమలో ఉండడం నామంచికే వచ్చిందనుకున్నాను. నీలాటివాడు పోటీకి తగులుకున్నాడంటే చచ్చే నన్నమాటే. ఆవిడ కోమట్రలావు పెళ్ళాం అనుకొని అటువైపు కన్నువెయ్యడం మానేశావు, కాని, కోమట్రలావుకి చెల్లెలే అవుతుందని తెలిస్తే వెంటనే రంగంలోకి రైటయిపోవూ ? !"

ఆమాట నిజమే. వాడలా చెప్తున్నప్పుడే నా మనసులోంచి దేవీ విగ్రహం మాయమయింది. వీనస్ విగ్రహం ప్రత్యక్షమయింది. కాని ఇప్పుడేమను

కాని ఏంలాభం ? నా ఇంట్యూషన్ నాకు స్టింకరిచ్చిమోసం చేసింది. కాని ఒక్క సందేహం ఉండిపోయింది.

"నేను అబద్ధాలకోరుననీ, స్కౌండ్రల్ మాంగర్ననీ కోమల్రావుతో చెప్పేవా లేదా ?"

"నిజంచెప్తే నీకు కోపంరాదుకదా?"

"చెప్పు ఫర్వాలేదు"

"అయితే చెప్తున్నా విను. కోమల్రావుతో అలా చెప్పక తప్పిందికాదు"

"ఏం ?"

"కోమల్రావుకి పెళ్లయింది. అతని పెళ్లాం నాకు చుట్టం కూడాను"

"అయితే ?"

"నువ్వతన్తో నాసంగతి ఎలానూ చెప్తావని 'గెస్' కొట్టేను. కాని అతని చెల్లెల్ని చూసి అతని వైపు అనుకొని 'మిస్టేక్' అవుతున్నావని అతని కేం తెలుస్తుంది; అప్పుడు కొంపలంటుకుపోవూ ? అందుచేత ముందే వార్నింగిచ్చి ఉంచేను నీ మాటలు నమ్మొద్దనీ" అంటూ కుర్చీలోంచి లేచి, "మరేం అనుకోకు భాయీ. ఆలీజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్. మా పెళ్లయిందాక మాత్రం నాల్రోజులు గుప్ చిప్ గా ఊరుకో" అనేసి వెళ్లిపోయాడు.

ఎంత గుండెలుతీసిన బంటో చూసుకోండి. ఎంత మాయగాడో తెలుసుకోండి. ఎలాంటి నాటకం ఆడేదో చూడండి. ఎన్ని ఎత్తులు ఎత్తేడో లెక్కెట్టండి. దగుల్బాజీ తనంలో ఎంతటి ఆరితేరిన చెయ్యో పరీక్షించండి. ఎంతటి దొంగబుద్ధో గ్రహించండి. ఈరోజుల్లో అలాంటి వెధ్వలకేఅదృష్టంఅనినమ్మండి. ఇంతకీ—ఈఎడ్యుకేటెడ్ అల్ట్రామోడర్న్ యంగ్ విమెన్ ఉన్నారే వాళ్ళెప్పుడు మగవాళ్ళల్లో మంచి బుద్ధి, తెలివితేటలూ, జబ్బ సత్తువా చూసి లవ్ చేయడంలేదు. జబ్బసత్తువ కావలిస్తే కావాలేమోగాని మంచి బుద్ధి మాత్రం అక్కర్లేదువాళ్ళకి. లేకపోతే, భూలోక రంభడిగాడికి ఉన్నట్టు హార్డ్ కోల్డ్ క్యాషైనా ఉండాలి. లేదా ఖాయమైన గజెటెడ్ ఆఫీసరు ఉద్యోగమైనా ఉండాలి. అదీకాకపోతే రాజుగారి బావమరదో, మంత్రిగారి మనవడో, సాందాని తమ్ముడో అయుండాలి. మీకటువంటి క్వాలిఫికేషన్స్లేన్నాడు, లేకపోయినా, ఉన్నట్టు వేషం వెయ్యలేదన్నాడు, ఏ చదువుకున్న అల్ట్రామోడర్న్ యంగ్ వుమనైనా మీ మీద కన్నేస్తే ఒట్టు. ఈ కథ ఇంతటితోటే ముగించేద్దునున్నమండి. కాని ఉన్నట్టుండి ఈ భూలోకరంభడుగాడు, అందాలభరిణిన్ని జేబులోవేసుకోవడమేకాకుండా ఢిల్లీలో ఖుషీగా మాంచి ఉద్యోగం ఒకటి కొట్టేసేడు. కాలేజీలో పెద్ద టీపార్టీ, స్టేషన్దగ్గర హ్యాట్ సెన్డాఫ్. అదంతా క్రిస్మస్ సెలవుల్లో నేనుఊళ్ళో

లేనప్పుడు జరిగింది. నేను తిరిగి వచ్చే లోపున పిచ్చెయ్యగాడు ఢిల్లీ చెక్కేశాడు. ఆ కోమట్లావు సిస్టర్ని పిచ్చెయ్యగాడు దగా చెయ్యకతప్పదని నాకెందుకోగాని మొదట్నించీ అనుమానంగానే వుంది. అందుచేత, వాడి అంతరంగిక బృందంలో ఒకణ్ణి పిల్చి.

"అయితే ఆ పిల్ల ఏమయింది? పెళ్ళి సెటిలయినట్లేనా?"అని అడిగేను.

"ఏ పిల్ల?" అని వాడు నన్ను ఎదురడిగేడు.

"అంతమంది ఉన్నారేమిటి మీ పిచ్చెయ్యగాడికి, ఏ పిల్లని అడుగుతున్నావు?" అని నే నన్నాను.

"లక్షా తొంభయిమంది" అన్నాడు వాడు సగర్వంగా

అదీ ఓ గొప్పే?

అది గొప్ప అయినప్పటికీ మధ్య వీడికెందుకా గొప్ప?

అప్పుడే చెప్పేను ఆ పిల్ల గుర్తులన్నీను. అన్నీ విని ఆ పిచ్చెయ్యగాడి స్నేహితుడుగాడు విరగబడి నవ్వేడు.

"ఎవరు? ఆ కోమట్లావు పెళ్ళామేనా? నాల్రోజులేదో ఖుషీగా తిరిగేడు. అంతేకాని ఆ టొంపని ఢిల్లీ కూడా తీసుకుపోతా డనుకున్నావా ఏమిటి?" అని చెప్పి –

"ఏఁవలా చూస్తున్నావ్? అవునవును. నీతో కోమట్లావుకి అది చెల్లెలవుతుందని చెప్పేట్టకదూ ... గొప్ప స్టిక్లరు. నీకు గుమ్మైన స్టింకరు" అని ఆ వెధవ మరీ మరీ విరగబడి నవ్వేడు. వాడికది నవ్వులాటగా తోచింది.

తుపాకీ వుంటే కాల్చేదును రాస్కెల్ని.

వాడలా చెప్పినప్పుడు మాత్రం నిర్ఘాంతపోయేను.

తరువాత అగ్గిబరాటా అయిపోయేను. కాని, ఏం లాభం?

స్నేహితులారా చూసేరా ఈ భూలోక రంభళ్ళ దగుల్బాజీతనం? చూసేరా వాళ్ళ దౌర్జన్యం? చూసేరా వాళ్ళ డిప్రేవిటీ? కోమట్లావు పాపం ఎంతో అమాయకుడు అమాయకుడైన అతని పెళ్ళానికి దానికేంపోయేకాలంవచ్చిందో చూసేరా? దాన్నేం చెయ్యాలో చెప్పండి. దాని కంటేకూడా, ఆ భూలోక రంభడుగాడు, ఆ దొంగ రాస్కెల్, ఆ పచ్చి స్కౌండ్రల్ వాణ్నేం చెయ్యాలో చెప్పండి. నేను కూడా చూస్తూనే వున్నాన్లెండి.

వాడు మళ్ళీ ఇటువైపు రాడా?

రాకపోడు.

అప్పుడేదో సందు చూసుకుని, వాడికి మస్తుగా ఖర్చు కిచ్చెయ్యకపోతే నా పేరు నా పేరుగాదు. ఖర్చు కిచ్చేనూ అంటే మళ్ళీ అలా ఇలా కాదు. దాన్తో వాడు పరిగెట్టి పరిగెట్టి మలయా పోయి వాడి బాబుతో చెప్పుకోవాలన్నమాటే!